సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 5 । జూలై । 2024



క్షుద్రపూజల కలకలం

గుర్రంకొండ పట్టణంలో క్షుద్ర పూజలు చేస్తున్నారని కలకలం రేగింది. అనుమానితులను పట్టుకున్న గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. -8లో



ప్రభుత్వ స్థలం కబ్జా

మదనపల్లె పట్టణ శివారు ప్రాంతాల్లో కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. -8లో



లారీ-సుమో ఢీకొని ఇద్దరి మృతి


ఓబులవారిపల్లె మండలం రెడ్డిపల్లె చెరువు కట్టపై సుమో వాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. మృతులిద్దరికీ ఇటీవలే వివాహమైంది. -8లో

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు
పుట్టా రెడ్ సిగ్నల్

రాష్ట్రంలో అధికారం చేపట్టీ చేపట్టగానే తెలుగుదేశం పార్టీ నాయకుల ఆగడాలు పెచ్చుమీరి పోతున్నాయి. వైఎస్సార్ జిల్లా మైదుకూరు పరిధిలో జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ బ్రేకులేశారు. తనకు కప్పం చెల్లించిన తర్వాతే పనులు మొదలు పెట్టాలని హుకుం జారీ చేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. అభివృద్ధికి అవరోధంగా నిలిచిన అధికార పార్టీ ఎమ్మెల్యే తీరు సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.

- రూ.15కోట్లు ముట్టజెపితేనే పనులు చేయాల్సిందిగా హుకుం
- అప్పటి వరకూ రహదారి నిర్మాణ పనులు చేయరాదని అడ్డగింత
- మూడు వారాలుగా మైదుకూరు పరిధిలో నిలిచిపోయిన పనులు
- ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ రంగప్రవేశంతోనే ఈ పరిస్థితి





సాక్షి ప్రతినిధి, కడప: వ్యాపారులు, ట్రాన్స్‌పోర్టర్లు, కాంట్రాక్టర్లు, రియల్టర్లు... రంగమేదైనా సరే జిల్లాలో అలాంటి వారికి పెద్ద కష్టమే వచ్చి పడింది. అధికారమే పెట్టుబడిగా తెలుగు తమ్ముళ్లు దాదాగిరితో సొంతం చేసుకుంటున్నారు. అభివృద్ధి పనులైనా, వ్యక్తిగత వ్యాపారాలు, ఉపాధి మార్గాలు ఏవైనా సరే వారి కన్ను పడిందంటే మాడిపోతున్నాయి. ఇన్నేళ్ల చరిత్రలో ఎన్నడూ లేని సంస్కృతి నెల రోజులుగా జిల్లాలో తిష్టవేసింది. తలమానికంగా నిలవాల్సిన అభివృద్ధి పనులకు సైతం ఆటంకాలు సృష్టిస్తున్నారు. జాతీయ స్థాయిలో పనిచేసే కాంట్రాక్టు సంస్థలకు సైతం చుక్కలు చూపిస్తున్నారు. వెరసి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు మైదుకూరు నియోజకవర్గంలో పుట్టా బ్రేకులు పడ్డాయి.

కొడికొండ చెక్‌పోస్టు నుంచి విజయవాడకు గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు మంజూరైంది. ప్రతిష్టాత్మకమైన ఈ రహదారి నిర్మాణాన్ని యావత్తు రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు. అందులో మూడు ప్యాకేజీ పనులు దిలీప్ దిల్కాన్ సంస్థకు దక్కాయి. మరో 3 ప్యాకేజీలు మెఘా కంపెనీకి లభించాయి. ఇంతవరకు జిల్లాలో ఆ పనులు శరవేగంగా కొనసాగించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రాగానే రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న దౌర్జన్యకర పరిస్థితులు కాంట్రాక్టు సంస్థలకు కూడా తాకాయి. దిలీప్ దిల్కాన్ సంస్థకు పులివెందుల నియోజకవర్గంలో టీడీపీ నేతల సెగ తగిలింది. అలాంటి పరిస్థితి తాజాగా మైదుకూరు నియోజకవర్గంలో కూడా ఉత్పన్నమైంది.

హైవే పనుల అడ్డగింత

మైదుకూరు నియోజకవర్గంలో అల్లాడుపల్లె సమీపం నుంచి వనిపెంట వరకూ 19.4 కిలో మీటర్లు గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు కొనసాగనున్నాయి. ఈ పనులను మెఘా ఇంజినీరింగ్ సంస్థ చేపట్టింది. శరవేగంగా కొనసాగుతున్న ఆ పనులకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ బ్రేకులేశారు. ఎన్నికల్లో ఖర్చు పెట్టుకున్నాం. మా ప్రాంతంలో పనులు చేస్తున్నారు. మాకు పర్సెంటేజీ ఇవ్వాలంటూ నేరుగా డిమాండ్ చేసినట్లు సమాచారం. పైగా రూ.15 కోట్లు ఇవ్వాలంటూ కమీషన్ రేటు కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. అప్పటి వరకూ పనులు చేపట్టరాదని హుకుం జారీ చేసి నట్లు సమాచారం. అంత పెద్ద స్థాయిలో కప్పం కట్టేందుకు కాంట్రాక్టు సంస్థ ముందుకు రాకపోవడంతో మూడు వారాలుగా మైదుకూరు పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు నిలిచిపోయాయి. మెఘా కాంట్రాక్టు సంస్థ చేపట్టిన ఆ పనులు నిలిచిపోయిన మాట వాస్తవమేనని పేరు వెల్లడించేందుకు ఇష్టపడని నేషనల్ హైవే అథారిటీ అధికారి ఒకరు వివరించారు.

తెలుగుదేశం సర్కార్ వచ్చినప్పటి నుంచి తెలుగు తమ్ముళ్లు అక్రమార్జనపై ప్రత్యేక దృష్టి పెట్టారు. జాతీయ స్థాయి కాంట్రాక్టు సంస్థలనే జిల్లాలో ముప్పుతిప్పలు పెడుతున్నారు. వ్యక్తిగత వ్యాపారాలను సైతం స్వాధీనం చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రం కడపలో ఓ వ్యాపారికి చెందిన రెండు బార్ అండ్ రెస్టారెంట్లు తెలుగు తమ్ముళ్లు స్వాధీనం చేసుకోవడమే ఇందుకు నిదర్శనం. పులివెందుల, కడప, జమ్మలమడుగులో ఇదే సంస్కృతి తెరపైకి వచ్చింది. దాల్మియా సిమెంట్ పరిశ్రమలో లారెన్స్

▸▸ అక్రమార్జనపై ప్రత్యేక దృష్టి

ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ కప్పం కట్టలేదని బుధవారం 18 లారీలను ధ్వంసం చేశారు. ఐసీఎల్, జువారీ నుంచి మామూళ్లు ముట్టలేదని ఆర్టీపీపీ నుంచి సరఫరా చేసే ఫ్లైయాష్‌ను రెండు రోజుల పాటు పోట్లదుర్తి బ్రదర్స్ నిలిపేయించారు. రేయింబవళ్లు యథేచ్ఛగా ఇసుక దోపిడీ చేస్తున్నారు. పాపాఘ్ని, పెన్నా నదుల్లో తెలుగు తమ్ముళ్లు పొక్లెయిన్లు పెట్టి పోటాపోటీగా టిప్పర్లతో ఇసుక తరలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇసుక దోపిడీ చేస్తున్నా అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్రకు పరిమితమైంది. పైగా తెలుగు తమ్ముళ్ల రోజువారి మామూళ్ల ఒప్పందంలో మునిగిపోతున్నారు. ఆయా వ్యక్తులకు చెందిన ప్రైవేటు స్థలాలు సైతం కబ్జా చేస్తున్నారు. కోర్టులో ఉన్న వ్యవహారాల్లో కూడా తలదూర్చి సొంతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. మునుపెన్నడూ ఇలాంటి అధ్వాన పరిస్థితులు జిల్లాలో చూసిన చరిత్ర లేదని పలువురు వాపోతుండడం గమనార్హం.

17 నుంచి శివ, కేశవస్వామి
బ్రహ్మోత్సవాలు



శ్రీ సిద్దేశ్వరస్వామి మూలవిరాట్టు



శ్రీచెన్నకేశవస్వామి మూలవిరాట్టు

తాళ్లపాక (రాజంపేట): పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుడు ఆరాధించిన తాళ్లపాకలోని శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 17నుంచి 25 వరకు జరగనున్నాయి. ఈనెల 22న శివ, కేశవ కల్యాణం ఒకే వేదికపై నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. 17న ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయి. 25న స్నపన తిరుమంజనం, పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని డిప్యూటీ ఈఓ నటేష్‌బాబు తెలిపారు.

చెన్నకేశవునికి..

చెన్నకేశవస్వామికి 17న హంసవాహనం, 18న చంద్రప్రభ వాహనం, 19న చిన్నశేషవాహనం, 20న సింహవాహనం, 21న శిఖరదీపారాధన, నందివాహనం, 23న పల్లకీసేవ, 24న పార్వేట ఉత్సవం నిర్వహించనున్నారు. 25న వసంతోత్సవం, ధ్వజావరోహణం, 26న స్నపన తిరుమంజనం, హోమం, పుష్పయాగం ఉంటాయి. 21న గరుడవాహనం, 22న కల్యాణం, 23న రథోత్సవం నిర్వహించనున్నారు.

సిద్దేశ్వరునికి..

సిద్దేశ్వరస్వామికి 16న దీక్షా తిరుమంజనం, అంకురార్పణ, 17న ధ్వజారోహణం, శేషవాహనం, 18న పల్లకీసేవ, హంసవాహనం, 19న సింహవాహనం, 20న హనుమంత వాహనం, 21న మోహినీ అవతారం, గరుడవాహనం, 22న కల్యాణం, 23న రథోత్సవం, 24న అశ్వవాహనం, 25న త్రిశూల స్నానం, 26న స్నపన తిరుమంజన కార్యక్రమాలు ఉంటాయి.

న్యూస్‌రీల్

కోదండరాముడి వ్యవసాయ భూముల కౌలు వేలం పాట

ఒంటిమిట్ట: రెండో అయోధ్యగా పేరుగాంచిన కోదండ రామాలయ ఆధీనంలో ఉన్న వ్యవసాయ భూముల కౌలు కోసం గురువారం టీటీడీ, రెవెన్యూ అధికారులు టెండర్లు నిర్వహించారు. మండలంలోని రెవెన్యూ పరిధిలోని 342, 753, 896/1, 1147, 1153, 1169, 1835, 81,86,925/3 సర్వే నంబర్లలో ఉన్న భూములకు సంవత్సరం కౌలు కోసం టెండర్లను ఆహ్వానించారు. టీటీడీ పరిపాలన భవనంలో టెండర్ల ప్రక్రియ చేపట్టారు. పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్ తెలిపారు.

7న దండోరా జనజాతర



జనజాతర కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

రాయచోటి అర్బన్: ఈనెల 7వతేదీన ఈదుల మూడిలో దండోరా జనజాతర నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పీఎస్ నాయకుడు రామాంజనేయులు తెలిపారు. గురువారం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద ఆయన దండోరా కార్యకర్తలతో కలసి దండోరా జనజాతర కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు దుద్యాల చిన్నప్ప, సుబ్బయ్య, సురేష్, జనకయ్య, లక్ష్మినారాయణ, బండపల్లె శ్రీను, లక్షుమయ్య, ఆంజనేయులు, రాములు, పామయ్య తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఏజీపీగా గడికోట దివ్యతేజ



గడికోట దివ్యతేజ

రాజంపేట: అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన గడికోట దివ్యతేజ హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు ఆయనను నియమిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. కాగా ఈయన తండ్రి గడికోట రామచంద్ర రాజంపేటలోన్యాయవాది కొనసాగుతున్నారు. హైకోర్టు ఏజీపీగా దివ్యతేజ నియామకం పట్ల రాజంపేటకు చెందిన పలువురు న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ పింఛన్లు

రామాపురం: అర్హులైన వారందరికి పింఛన్లు అందేలా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. గురువారం మండలంలోని హసనాపురం, వడ్డెపల్లె, కుమ్మరపల్లె, చీకటివాండ్లపల్లె గ్రామాల్లో పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులపై ఆయన విచారణ చేపట్టారు. ఆ గ్రామానికి చెందిన నాయకులు ఇటీవల ఎంపీడీఓ ప్రభాకర్‌ను కలిసి పింఛన్ల పంపిణీలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జేసీ గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులను విచారించారు. యర్రంగివాడ్లపల్లెలో ఒకే కుటుంబంలో ఏడు పింఛన్లు వస్తున్నాయని జేసీ దృష్టికి వచ్చింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఓబులమ్మ, ఇన్‌చార్జి వీఆర్‌ఓ ఫాతిమా, ఎంపీడీఓ కార్యాలయం ఏఓ రవికుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ రామ్మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఎఫ్‌ఏ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం, లలితకళా విభాగంలో నాలుగు సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ కోర్సు ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు తెలిపారు. ఈ కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్‌లో ఏగ్రూప్‌లో ఉత్తీర్ణత అయినా అర్హులని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఉన్నత అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నెల 10వతేదీ లోపు వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు, సందేహాలకు డాక్టర్ కె. మృత్యుంజయరావు ఫోన్ నెంబర్ 9010014304 లో సంప్రదించాలని కోరారు.

11 లోపు రుసుం చెల్లించండి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు లాంగ్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ నివేదికను సమర్పించి వైవా-వోస్‌కు హాజరుకాని విద్యార్థుల కోసం వైవీయూ అవకాశం కల్పిస్తోందని పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి తెలిపారు. రుసుం ఆన్‌లైన్ ద్వారా ఈనెల 11తేదీ లోపు చెల్లిస్తే జిల్లా కేంద్రంలోని ఒక సెంటర్లో వైవా-వోస్ నిర్వహిస్తామన్నారు. తేదీ ఎప్పుడన్నది తర్వాత తెలియజేస్తామన్నారు. అలానే వైవా-వోస్ జరిగే సమయంలో లాంగ్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ రికార్డ్ హార్డ్ కాపీని విద్యార్థులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. లాంగ్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ పూర్తి చేసి, ఆరో సెమిస్టర్ ఫీజు ఇదివరకు చెల్లించని విద్యార్థులు వెంటనే రుసుము చెల్లించి సర్టిఫికెట్లను అందజేయాలని సూచించారు.

'సంపూర్ణత అభియాన్'ను విజయవంతం చేయాలి

జిల్లా నోడల్ అధికారి ధనలక్ష్మి



సంపూర్ణత అభియాన్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

కురబలకోట: కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో వినూత్నంగా చేపట్టిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా నోడల్ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని అంగళ్లు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం, పోషకాహారం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి రంగాల్లో వంద శాతం సంతృప్తిని సాధించడానికి సంపూర్ణత అభియాన్ కింద ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. జిల్లాలో కురబలకోట, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరు మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారన్నారు. సుపరిపాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయడం వారి జీవన ప్రమాణాలను పెంపొందించడం ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మదన్‌మోహన్‌రెడ్డి, హేమకుమార్, అంగళ్లు సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, సురేంద్ర యాదవ్, పి. సురేంద్ర, వైద్యాధికారి శ్రీధర్, ఎంఈఓలు ద్వారకనాథ్, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు అబ్దుల్ షుకూర్, రాధ, నీరజ, నాగవేణి పాల్గొన్నారు.

మహోజ్వల శక్తి అల్లూరి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాయింట్ కలెక్టర్

రాయచోటిరూరల్: స్వరాజ్య సంగ్రామ చరిత్రలో అల్లూరి ఒక మహోజ్వల శక్తి.. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తి, ధైర్యాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్వాతంత్య్రం కోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడన్నారు. ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్య్ర ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం అన్నారు. ఆయన చూపిన ధైర్యం, తెగువ భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి సందప్ప, కలెక్టరేట్ ఏఓ గోవిందొంగ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మన్యం వీరునికి ఎస్పీ నివాళి



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి సెల్యూట్ చేసి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బుధవారం రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుడు, సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టవచ్చని నమ్మి ఆచరణలో పెట్టిన మహనీయుడు సీతారామరాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వీబీ రాజ్ కమల్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఏఏఓ కృష్ణుడు, ఇన్‌స్పెక్టర్లు భాస్కర్, వెంకటేశ్వర్లు, నాగేంద్ర, ఉమా మహేశ్వర్, ఆర్ఐ పెద్దయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, డీపీఓ సిబ్బంది, ఎస్‌ఈబీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ అడ్మిషన్.!

- డిగ్రీ అడ్మిషన్లకు షెడ్యూలు విడుదల
- ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలి
- 22 నుంచి తరగతులు ప్రారంభం



మదనపల్లెలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ

మదనపల్లె సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం ఆన్‌లైన్‌లో అడ్మిషన్లకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. అడ్మిషన్ల షెడ్యూల్ ఇప్పటికే చాలా ఆలస్యమైందని అధ్యాపక బృందం చెబుతోంది. ఆలస్యంగా షెడ్యూలు విడుదల చేసిన ప్రభుత్వం దరఖాస్తులకు తక్కువ సమయం ఇచ్చింది. ఈనెల 10వ తేదీలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులకు ఒక వారం రోజులు సమయం ఉండటంతో విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

- జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 1వతేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలోని డిగ్రీ కాలేజీల్లో సైన్సు, ఆర్ట్స్, కామర్స్, ఒకేషనల్ కోర్సుల్లో సీట్ల భర్తీకి అవకాశం ఉంది.

చదువు మానేసినా సర్టిఫికెట్ కోర్సు..

విద్యార్థులు డిగ్రీ ఫస్టియర్ చదివి మానేసినప్పటికీ సర్టిఫికెట్ కోర్సు పేరుతో సర్టిఫికెట్ పొందవచ్చు. రెండేళ్లు అయితే డిప్లొమా సర్టిఫికెట్, మూడేళ్లు అయితే డిగ్రీ సర్టిఫికెట్, నాలుగేళ్లు చదివితే డిగ్రీ ఆనర్స్ సర్టిఫికెట్‌ను అందిస్తారు. విద్యార్థి డిగ్రీ నాలుగేళ్లలో ఎప్పుడైనా మధ్యలో చదువు మానేసేందుకు వెసులుబాటు ఉంది. దానికి అనుగుణంగా ఆ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. ఫస్టియర్ నుంచి నాలుగేళ్లలోపు ఏ దశలో చదువు మానేసినా, ఏడేళ్ల లోపు తిరిగి ప్రవేశం పొందే విద్యాభ్యాసం కొనసాగించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. డిగ్రీ విద్యా విధానంలో ప్రవేశపెట్టిన నూతన సింగిల్ మేజర్ ఆనర్స్ డిగ్రీ పద్ధతిపై ఇంటర్మీడియట్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గత విద్యా సంవత్సరం నుంచే నూతన విద్యావిధానం అమలవుతోంది.

జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీల వివరాలు



మదనపల్లె	2
రాయచోటి	2
పీలేరు	1
వాల్మీకిపురం	1
కలికిరి	1
రాజంపేట	1
రైల్వేకోడూరు	1
ఉమ్మడి చిత్తూరు జిల్లాలో..	
ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు	17
ప్రైవేటు డిగ్రీ కాలేజీలు	122

నిబంధనలకు అనుగుణంగా సీట్లు..

డిగ్రీ కోర్సుల్లో 50 శాతం రిజర్వేషన్లు తప్పనిసరి చేశారు. ఇంటర్‌లో కామర్స్ ఒక సబ్జెక్టుగా చదివిన వారికి బీకాం కోర్సులో 60 శాతం సీట్లు కేటాయిస్తారు. ఆర్ట్స్ హ్యూమానిటీస్ ఇంటర్ పూర్తి చేసిన వారికి బీఏ సీట్లలో 50 శాతం సీట్లు కేటాయిస్తారు. తక్కిన 50 శాతం ఇంటర్ సైన్సు గ్రూపు పూర్తి చేసిన వారికి కేటాయిస్తారు. ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, సాధారణ కోర్సులతో పాటు కంప్యూటర్, మార్కెట్ ఓరియంటెడ్, ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. విద్యార్థులు ఓఏఎండీ.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దగ్గర్లో ఉన్న డిగ్రీ కాలేజీలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సాధారణ కోర్సులకు రూ.3 వేల వరకు, కంప్యూటర్ కోర్సులకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఫీజు ఉంటుంది.

నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు..

జాతీయ విద్యావిధానం 2020 నిబంధనలను అనుసరించి ఏపీ ఉన్నత విద్యా మండలి ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రవేశపెట్టింది. సంప్రదాయక మూడేళ్ల డిగ్రీ కోర్సుల స్థానంలో నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులను అమలు చేస్తున్నారు. ఈ కోర్సుల్లో గతంలో మాదిరిగా మూడు మేజర్ సబ్జెక్టులు కాకుండా, ఒక్కటే మేజర్ సబ్జెక్టు ఉంటుంది. దీన్ని సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సుగా పిలుస్తారు. ఉదాహరణకు గతంలో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ మేజర్ సబ్జెక్టులుగా బీఎస్సీ చదువుకునే విద్యార్థి సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలో బీఎస్సీ బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీల్లో ఏదో ఒక సబ్జెక్టును మేజర్ సబ్జెక్టు ఎంచుకుని, తనకు నచ్చిన వేరే సబ్జెక్టును మైనర్ సబ్జెక్టుగా ఎంచుకుని చదువుకోవాలి. ఇంటర్‌లో ఆర్ట్స్, సైన్స్ సబ్జెక్టులతో సంబంధం లేకుండా ఏ సబ్జెక్టునైనా మైనర్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవచ్చు.

▸▸ ఇదే షెడ్యూల్

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ మంగళవారం మొదలైంది. ఈనెల 10వతేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందులో భాగంగా ఈనెల 4 నుంచి 6వతేదీ వరకు స్పెషల్ కేటగిరి వెరిఫికేషన్ ఉంటుంది. స్పెషల్ కేటగిరి వెరిఫికేషన్లు ఆయా యూనివర్సిటీల్లో ప్రాంతాల వారీగా నిర్వహిస్తారు. ఈనెల 5న ఓపెనింగ్ ఆఫ్ హెచ్‌ఎల్‌సీ ఫర్ వెరిఫికేషన్ ఆఫ్ సర్టిఫికెట్స్ ఉంటుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో చిత్తూరు, తిరుపతిలో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. కోర్సులను ఎంపిక చేసుకోవడం కోసం ఈనెల 11 నుంచి 15వతేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు. ఈనెల 19న సీట్లు కేటాయించి, అలాట్ అయిన విద్యార్థులు ఎంపికైన కాలేజీలో ఈనెల 20 నుంచి 22వతేదీలోగా రిపోర్టు చేయాలి. ఈనెల 22 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

అత్యుత్తమ ప్రమాణాలు



ఇంటర్, తత్సమాన విద్యార్హత ఉన్నవారు డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి. కాలేజీలో మౌలిక వసతులు మెరుగ్గా ఉన్నాయి. అత్యున్నత ప్రమాణాలతో మా కాలేజీలో బోధన ఉంటుంది. జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎన్‌ఎస్‌ఎస్, ప్లేస్‌మెంట్ సెల్ ఉన్నాయి. అడ్మిషన్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

–క్రిష్ణవేణి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, మదనపల్లె

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



జిల్లా స్థాయికి ఎంపికైన బాలికల జట్టు

మదనపల్లె సిటీ : స్థానిక శ్రీవేద పాఠశాలలో గురువారం జిల్లా జూనియర్, సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు మురళీధర్ తెలిపారు. జిల్లా నలమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. జూనియర్ బాలికల జట్టు శనివారం నుంచి అనంతపురం ఆర్‌డీటీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ, సబ్ జూనియర్ జట్టు ఆగస్టులో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేద పాఠశాల ప్రిన్సిపల్ ఉపేంద్రరెడ్డి, కమలేష్, మహేంద్రనాయక్, నరేష్, మహేంద్ర, అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ బాలికల జట్టు : మహాలక్ష్మి, షబానా, వైష్ణవి, ఇషిత, తన్మయ, స్ఫూర్తి, విజయలక్ష్మి, పల్లవి, భార్గవి, అర్పిత, మహేశ్వరి, మోక్షిత, కీర్తి, హర్షవర్ధిని, విజయేశ్వరి, మోనిక, ఎం.పల్లవి

టీ–20 జిల్లా క్రికెట్ జట్టు



జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కేవీపల్లె : జిల్లా అండర్–16, అండర్–19 టీ–20 క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బ్రహ్మాజీ తెలిపారు. అండర్ 16కు శ్రీనాథ్‌రెడ్డి, వెంకటరమణ, మోహిత్, విజయకృష్ణ, సంతోష్, లోకేష్, నిహష్, శివప్రసాద్, వేదంత్, నంద కిషోర్, గణేష్, ప్రవీణ్, లక్ష్మీపతి, రెడ్డిప్రకాష్, చంద్రపతి, శరత్‌కుమార్ ఎంపియ్యారని తెలిపారు. అండర్ 19కు గిరివర్ధన్, రేవంత్, యోగానంద్, ఓంప్రకాష్, జ్యోతి ప్రకాష్, పవన్‌కుమార్, సుజిత్‌కుమార్, శామ్యూల్, మహిమరాజ్, శ్రీను, హనుమంత్, దేవేంద్ర, సింహాంద్రి, జశ్వంత్‌నాయక్, మునెయ్య ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ పురుషోత్తం, అద్వైత్ పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు అడ్డుకట్ట

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మడుమూరు సమీపంలో పలువురు వ్యక్తులు జేసీబీలతో ఇసుక తోడి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ రవీంద్రబాబు దాడులు నిర్వహించి రవాణాను అడ్డుకున్నారు. అనధికారికంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్షుద్ర పూజల కలకలం

- నెలరోజులుగా గుర్రంకొండ పరిసరాల్లోనే మకాం
- కేరళ గుప్త నిధుల ముఠా సభ్యులపై అనుమానం
- పట్టుకొని పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

గుర్రంకొండ పట్టణం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. క్షుద్ర పూజలు చేస్తున్నారని కలకలం రేగడం సంచలనం కలిగింది. అనుమానితులను పట్టుకున్న గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. కేరళ రాష్ట్రం నుంచి వచ్చి గత నెల రోజులుగా ఇక్కడే మకాం వేసినట్లు సమాచారం. మరో వైపు చారిత్రాత్మక గుర్రంకొండ పరిసరాల్లో గుప్త నిధుల తవ్వకాలతో అలజడి నెలకొంది. మండలానికి చెందిన వ్యక్తులే ఇక్కడికి తీసుకొచ్చారని గ్రామంలో చర్చ సాగుతోంది.





చెర్లోపల్లె శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయ పరిసరాల్లో క్షుద్రపూజలు నిర్వహించిన దృశ్యం, కేరళనుంచి వచ్చిన వ్యక్తులను విచారిస్తున్న పోలీసులు

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణానికి సమీపంలోని సాయి మందిరంలో కొంతమంది కేరళ నుంచి వచ్చిన వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహిస్తున్నారనే సమాచారం అందుకొన్న గ్రామస్థులు గురువారం పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. నిమ్మకాయలు, టెంకాయలు, పసుపు, కుంకుమతో పూజలు చేసిన ఆనవాళ్లు కనబడడంతో వారిని నిలదీశారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో వారిని పట్టి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని వారిని విచారించేందుకు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బజారు వీధికి చెందిన కొందరు వ్యక్తులు అక్కడే ఉండడంతో వారి ఇళ్లలో రాత్రిళ్లు పోలీసులు సోదాలు నిర్వహించారు. కేరళకు చెందిన వ్యక్తుల యొక్క సంచులు, ఇతర సామగ్రి ఉన్నట్లు గుర్తించారు. నెల రోజులుగా వారు చుట్టుపక్కల గ్రామాల్లో పలు కార్యక్రమాలు చేస్తున్నట్లు తేలింది.

రెడ్డెమ్మకొండ పరిసరాల్లోనూ..

కేరళకు చెందిన ముఠా సభ్యులు చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మకొండ పరిసరాల్లో గత నాలుగు వారాలుగా క్షుద్ర పూజలు నిర్వహించినట్లు గ్రామస్థులు తెలిపారు. రెడ్డెమ్మతల్లి ఆలయానికి కొంత దూరంలోని అటవీ ప్రాంతంలో అక్కదేవతల ఆలయం ఉంది. సమీప ప్రాంతంలో కేరళకు చెందిన తాంత్రికులు పెద్ద ఎత్తున క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లున్నాయని గ్రామస్థులు తెలిపారు. పసుపు, కుంకుమలతో పెద్ద ఎత్తున ముగ్గులు వేసి అందులో నిమ్మకాయలు, టెంకాయలు ఉంచారు. పెద్ద నల్లరంగు మేకపోతును అక్కడ బలి ఇచ్చి మేక పోతు తలను ముగ్గు మధ్యలో ఉంచి పూజలు నిర్వహించినట్లు పశుకాపరులు పేర్కొన్నారు. మరోసారి కోడి తలలు ముగ్గులో ఉంచి పూజలు నిర్వహించినట్లు సమచారం. ఇలా నాలుగువారాల పాటు అక్కడ పూజలు నిర్వహించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొందరు నాయకుల్ని లక్ష్యంగా చేసుకొని చేతబడులు చేసినట్లు చర్చ సాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. రెడ్డెమ్మకొండ ఆలయం పురాతన చరిత్ర కలిగిన ఆలయం కాబట్టి గుప్తనిధులు ఉంటాయనే నమ్మకంతో ఈ పూజలు చేసి ఉంటారని గ్రామస్థులు అంటున్నారు.

పురాతన రాతి మసీదుల్లో..

గుర్రంకొండ, సంగసముద్రం గ్రామాల సరిహద్దుల్లో పురాతన రాతి మసీదుతోపాటు నవాబుల కాలం నాటి పురాతన కట్టడాలున్నాయి. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కేరళకు చెందిన తాంత్రికుల్ని ఇక్కడి తీసుకొచ్చినట్లు సమాచారం. గతంలోనూ ఇక్కడ రెండు మార్లు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. అప్పట్లో ఈ సంఘటనలపై కేసు నమోదు చేసి 18 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మళ్లీ ఇప్పుడు ఈ ముఠా సభ్యులు తమ కార్యకలాపాలు యథేచ్ఛగా జరుపుతున్నారు. రాత్రిళ్లు ఈ పరిసరాల్లో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. కొందరు ఈ పరిసరాల్లో కూడా గుప్తనిధుల కోసం పూజలు నిర్వహించినట్లు తెలిపారు. స్థానికంగా నివాసముండే వ్యక్తులు గుప్తనిధుల తవ్వకాల కోసం తీసుకు వచ్చారా? లేదా? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది

మండలం నుంచి పంపించి వేశాం



గుర్రంకొండ సమీపంలోని సాయిబాబా మందిరంలో అనుమానాస్పదంగా మకాం వేసిన కొంత మంది వ్యక్తుల్ని గ్రామస్థులు పట్టి తరలించారు. వారిని విచారించగా కేరళ నుంచి వచ్చినట్లు తేలింది. వారు గ్రామాల్లో తిరుగుతూ కేరళ ఆయుర్వేద వైద్యం చేసే వారని చెబుతున్నారు. వారి కదలికలు అనుమానస్పదంగా ఉండడంతో మండలం నుంచి దూరంగా పంపించి వేశాం.

– నాగార్జునరెడ్డి, ఎస్‌ఐ.గుర్రంకొండ

నిండు గర్భిణిని చూసేందుకు వెళ్తూ ప్రమాదంలో భర్త దుర్మరణం

– లారీ–సుమో ఢీకొని ఇద్దరి మృతి



నుజ్జునుజ్జయిన వాహనంలో చిక్కుకున్న మృతదేహాలు

రైల్వేకోడూరు : నిండు గర్భిణి అయిన భార్యను చూడాలని వెళ్తూ.. రోడ్డు ప్రమాదంలో భర్త మరణించిన సంఘటన ఓబులవారిపల్లె మండలం రెడ్డిపల్లె చెరువు కట్టపై గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... రెడ్డిపల్లె దళితవాడ గ్రామానికి చెందిన ఆర్.వెంకటేష్(27) భార్య తొమ్మిది నెలల గర్భిణి. ఆమెను చూసేందుకు చిన్న ఓరంపాడులో తన చిన్ననాటి స్నేహితుడు ఉన్న వై.సుబ్బరాయుడు(30)ను తీసుకుని రాజంపేట సమీపంలోని పులపత్తూరు రేణింతల గ్రామానికి సుమో వాహనంలో బయలుదేరాడు. రెడ్డిపల్లె చెరువు కట్ట వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. సుమో ముందు బాగం నుజ్జు నుజ్జయింది. వాహనం నడుపుతున్న వెంకటేష్‌తోపాటు, అతడి పక్కన కూర్చున్న సుబ్బరాయుడులకు తీవ్ర గాయాలవడంతో అక్కడిక్కడే మృతి చెందారు. వెంకటేష్‌కు ఏడాది కిందట వివాహం కాగా.. డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సుబ్బరాయుడు రేణింతల గ్రామం కాగా.. అతడికి ఇటీవల వివాహమైంది. ఎస్‌ఐ చిన్నపెద్దయ్య ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రైల్వేకోడూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ఎస్సై చిన్న పెద్దయ్య తెలిపారు.


రహదారి పనుల్లో రాజకీయం వద్దు



అధ్వానంగా ఉన్న రహదారి

సంబేపల్లె : మండల పరిధిలోని చిన్నబిడికి, నడిమిరాజు, ఎగువరాజుగారిపల్లె, దిగువరాజుగారిపల్లె, హరిజన వాడ, వంకవారి ఇండ్లకు అనుసంధానంగా వెళ్లే రహదారి మరమ్మతులపై రాజకీయం చేయవద్దని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు టెండర్ దక్కించుకుని ప్రారంభించిన చిన్నబిడికి రహదారి మరమ్మతులు నిలిచిపోయిన సంగతి పాఠకులకు విదితమే. గత 20 ఏళ్లుగా వినతులు సమర్పించగా.. ఇపుడు రహదారి మరమ్మతులు చేపడితే టీడీపీ నాయకులు అడ్డుపడి నిలుపుదల చేయడం మంచిది కాదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల వాసులు ఈ రహదారిపై దేవపట్ల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వస్తారని, రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణించడం కష్టంగా ఉందన్నారు. రహదారి దెబ్బతినడంతో అనారోగ్య పరిస్థితుల్లో జాతీయ రహదారి చేరాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. రాజకీయాలు మాని ప్రజల అవసరాల మేరకు అభివృద్ధిని ఆకాంక్షిస్తూ అడుగులు వేయాలని తెలిపారు.

అభివృద్ధిని ఆపకండి



చిన్నబిడికి రోడ్డు మరమ్మతులను అధికార పార్టీ నాయకులు అడ్డుకోవడం హేయమైన చర్య. రహదారులు అనేవి అందరికీ అవసరమైనవి. ఒక పార్టీకో, వ్యక్తికో ఉండవు. పనులు వెంటనే పూర్తిచేసి రహదారి అందుబాటులోకి తేవాలి.

– ఉషారాణి, రెడ్డివారిపల్లె సర్పంచ్, సంబేపల్లె మండలం

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒకరు మృతి చెందినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ గుండావాండ్లపల్లెకు చెందిన ఆవుల వ్యాపారి యర్రబెల్లి రెడ్డెప్ప(53) జూన్ 30న మద్యం తాగాడు. కొంతసేపటికి సమీపంలో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్న రెడ్డెప్పను గమనించి కుటుంబ సభ్యులకు స్థానికులు సమాచారం అందించారు. కొడుకు వై.వెంకటేష్, తండ్రిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాలో చేర్చారు. గుర్తు తెలియని వాహనం రెడ్డెప్పను ఢీకొని గాయాలయ్యాయని పోలీసులు నిర్ధారించారు. రెడ్డెప్ప బుధవారం రాత్రి చనిపోవడంతో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇద్దరికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న వ్యక్తులు

వల్లూరు : కడప–తాడిపత్రి రహదారిపై తోళ్లగంగనపల్లె బస్టాపు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు... గ్రామానికి చెందిన వెంకటరమణ ద్విచక్ర వాహనంలో వెళ్తూ కడప నుంచి యర్రగుంట్ల వైపునకు వస్తున్న బుదేరాం ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కడపకు చెందిన బుదేరాంతోపాటు వెంకటరమణలకు గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

ఎరువుల దుకాణ డీలర్లపై చర్యలు తప్పవు

రాయచోటి ఏడీఏ కె శ్రీలత



నిమ్మనపల్లె ఎరువు దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ శ్రీలత

నిమ్మనపల్లె : ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో నిబంధనలు పాటించని డీలర్లను ఉపేక్షించేది లేదని రాయచోటి వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) కె.శ్రీలత అన్నారు. మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్‌తో కలిసి నిమ్మనపల్లి ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో గురువారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాకు రిజిష్టర్, బిల్లు పుస్తకాలు, ధరల పట్టిక పరిశీలించారు. బాలాజీ ఫర్టిలైజర్స్ దుకాణం యజమాని నిర్వహిస్తున్న ఎరువుల గోదాము లైసెన్సు, ఇతర వివరాల్లో తేడాలు గుర్తించారు. గోదాములో నిల్వ ఉంచిన 37.65 టన్నుల ఎరువు విక్రయాలు తాత్కాలికంగా నిలిపివేయాలని బాలాజీ ఫర్టిలైజర్స్ దుకాణదారుడిని ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, కుమార్ నాయక్, డీలర్లు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో గంజాయి కలకలం

వేంపల్లె : సాంకేతిక విద్య అందించాలనే సంకల్పంతో ఏర్పాటుచేసిన ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో గురువారం గంజాయి కలకలం రేపింది. బుధవారం రాత్రి కళాశాలలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గంజాయి, సిగరెట్లు తీసుకెళ్తూ సెక్యూరిటీ సిబ్బందికి పట్టుబడ్డారు. ఈ విషయాన్ని వారు ట్రిపుల్ ఐటీ అధికారులకు తెలుపగా కోర్ కమిటీ సమావేశం నిర్వహించి విద్యార్థులను మందలించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి విషయం తెలియజేశారు. సుమారు 40 గ్రాముల గంజాయి దొరికినట్లు సమాచారం. ఈ విషయంపై ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొ.కుమార స్వామి గుప్తా స్థానిక ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని వాటిని ఎక్కడ నుంచి తీసుకొచ్చారు.. ఎలా అలవాటు పడ్డారనే విషయంపై కళాశాల సిబ్బంది విచారించినట్లు తెలిసింది. నెల్లూరుకు చెందిన విద్యార్థి గత సెలవుల్లో వీటికి అలవాటు పడ్డారని, కడపలో తన ఫ్రెండ్ గంజాయి తీసుకొచ్చి ఇస్తాడు.. తీసుకురమ్మని గాలివీడుకు చెందిన మరో విద్యార్థికి చెప్పడంతో అతడు బుధవారం గంజాయి తీసుకువస్తూ సిబ్బందికి పట్టుబడినట్లు సమాచారం.

ప్రభుత్వ స్థలం కబ్జా

- కోట్ల రూపాయల విలువ చేసే స్థలం ఆక్రమణ
- అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరవు



ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ

మదనపల్లె : కంచే చేను మేస్తున్న చందంగా.. అక్రమాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులే అక్రమాలకు కొమ్ము కాస్తున్నారు. కబ్జారాయుళ్లకు తెర వెనుక నుంచి సహకారం అందిస్తుండడతో మదనపల్లె పట్టణ శివారు ప్రాంతాల్లో కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. కబ్జాదారులు ప్రభుత్వ భూములను బహిరంగంగా ఆక్రమించి, కాంపౌండ్ వాల్ నిర్మించుకున్నప్పటికీ, ఏమీ పట్టనట్లు అధికారులు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మదనపల్లె మండలం తట్టివారిపల్లె పంచాయతీ వెంకప్పకోట రెవెన్యూ విలేజ్‌లో సర్వేనెం.5/2లో 2.99 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఇందులో ఎకరా స్థలం శ్మశానానికి కేటాయించారు. మిగిలిన 1.99 ఎకరాల విస్తీర్ణం భూమి అనంతపురం–కృష్ణగిరి జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో కబ్జాదారులు కన్నేశారు. దీనికి తోడు సర్వేనెం.5/1, 5/3 పట్టా భూమి కావడం, హక్కుదారులు ఐదేళ్ల కిందట దానిని విక్రయించడంతో, వాటి మధ్య ఉన్న ఈ భూమిని ఎలాగైనా కాజేయాలని ప్రణాళిక రూపొందించారు.

ఎన్నికల సమయంలో కబ్జా

రెవెన్యూ అధికారులు ఎన్నికల హడావుడిలో తలమునకలై ఉన్న సమయంలో స్థానిక రెవెన్యూ అధికారుల సాయంతో సర్వేనెం.5/2లోని ప్రభుత్వ స్థలంలో పది కుంటలకు పైగా చదునుచేసి ఓ అక్రమార్కులు ప్రహరీ నిర్మించేశారు. సర్వేనెం.5/2కు ఆనుకుని 78–1ఎ సర్వే నెంబర్‌లో 1.01 ఎకరాల భూమికి డీకేటీ పట్టా ఉన్న పి.రెడ్డెప్ప స్థలం పరిశీలించగా.. ఈ విషయం వెలుగు చూసింది. కబ్జాదారుడిని ఇదేమని ప్రశ్నిస్తే రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తామన్నారని, అందుకే ప్రహరీ నిర్మించాలని కబ్జాదారుడు చెబుతున్నట్లు తెలిసింది. దీంతో ఈ విషయంపై రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంలో లక్షల రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు వినవస్తున్నాయి.

ప్రభుత్వ స్థలం ఆక్రమించకుండా చూస్తాం

ప్రభుత్వస్థలాల్లో ఎవ్వరికీ పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చే అవకాశం లేదు. వెంకప్పకోట సర్వేనెం.5/2లో ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని మండల సర్వేయర్‌ను ఆదేశిస్తాం. హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసి, స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా పర్యవేక్షిస్తాం.

– రమాదేవి, తహసీల్దారు, మదనపల్లె

అక్రమ మద్యం ధ్వంసం



ధ్వంసం చేయడానికి సిద్ధం చేస్తున్న మద్యం సీసాలు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ శివారులో ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన మద్యం సీసాలను గురువారం ధ్వంసం చేశారు. రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన రూ.7.5 లక్షల విలువగల మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిడెంటెంట్ శ్రీనివాసులు తెలిపారు. రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని మండలాలు, లక్కిరెడ్డిపల్లె మండల పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుకున్న సీసాలన్నీ ఎక్సైజ్ సీఐ హిమబిందు ఆధ్వర్యంలో డోజర్‌తో నాశనం చేసినట్లు తెలిపారు.

ఎరువులు, విత్తన దుకాణాల తనిఖీ



ఎరువుల స్టాక్ పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

మదనపల్లె : రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు ఎంఆర్‌పీ ధరలకే అందించాలని పీలేరు ఏడీఏ రమణరావు అన్నారు. పట్టణంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో ఏఓ నాగప్రసాద్‌తో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. షాపులకు సంబంధించిన రిజిష్టర్లు, స్టాక్‌ను పరిశీలించి బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రూ.5.4 లక్షల విలువ చేసే పది టన్నుల కాల్షియం నైట్రేట్ ఎరువు విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించారు. అనధీకృత సంస్థల ఎరువులు, విత్తనాలు అమ్మకానికి ఉంచితే స్టాక్‌ను సీజ్‌చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గిరిజన విద్యార్థి సమాఖ్య కమిటీ ఏర్పాటు



సుండుపల్లె : సుండుపల్లె టౌన్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఆంధ్ర ప్రదేశ్ గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పూజారి రెడ్డి శేఖర్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడుగా నాగన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు నాగేంద్ర నాయక్ చౌహాన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాజీలేని విధంగా విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు పని చేయాలని సూచించారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, సుండుపల్లి అధ్యక్షుడు ప్రసాద్ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

టన్నెల్ నిర్మాణానికి నిధులు మంజూరుపై హర్షం

– అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి : రాయచోటి–కడప మార్గంలోని గువ్వలచెరువు టన్నెల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న గువ్వల చెరువు ఘాట్ టన్నెల్ నిర్మాణానికి 2024–25లో రూ.1000 కోట్లు కేటాయిస్తూ అనుమతి ఇవ్వడం ఆనందదాయకమన్నారు. 2021లో ఎంపీ మిథున్ రెడ్డి, తాను ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని టన్నెల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. తమ విన్నపానికి స్పందించిన కేంద్ర మంత్రి టన్నెల్ ఫైల్ పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు 2022లో సర్వే చేయడం, 2023లో టెండర్ పిలవడం, ఇపుడు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. సర్వే ప్రకారం ఆరు కిలోమీటర్ల మేర ఇరువైపులా అప్రోచ్ రోడ్డు, దాదాపు 2.50 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం ఉన్నాయన్నారు. టన్నెల్ నిర్మాణానికి సహకరించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టన్నెల్ నిర్మాణం పూర్తయితే రవాణా సౌకర్యం మెరుగవడమేగాక, చాలా వరకూ ప్రమాదాలు తగ్గి ప్రాణ, ఆస్తి నష్టం తగ్గుతుందన్నారు.

విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకటరమణ

వీరబల్లి : మండలంలోని తాటికుంటపల్లి పంచాయతీ పిచ్చిగుంటపల్లికి చెందిన కత్తి వెంకటరమణ(28) బుధవారం రాత్రి విద్యుత్తు తీగ తగిలి మృతిచెందాడు. తాటికుంటపల్లికి చెందిన మోటకట్ల బాబు, రామ్మోహన్ రెడ్డి కలిసి అటవీ ప్రాంతంలో అడవి పందుల కోసం కిలోమీటరు మేర విద్యుత్తు తీగలు లాగి రాత్రంతా అలాగే ఉంచారు. అదే సమయంలో వెంకటరమణ, మోహన్, భాస్కర్, రమేష్‌లు కలిసి అడవి జంతువుల వేటకు వెళ్లారు. ఈ నేపథ్యంలో వెంకటరమణ విద్యుత్తు తీగను తాకి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడితోపాటు వెళ్లిన వ్యక్తులు గ్రామంలోకి వచ్చి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. వెంకటరమణ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.